
సాక్షి
అన్నమయ్య జిల్లా
బుధవారం । 23 । ఏప్రిల్ । 2025



కరెంటు కష్టాలు..!
రాజంపేట మండల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. -8లో



పింఛన్ల సొమ్ము స్వాహాపై విచారణ
మల్లెల గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ ఏ.గిరి పింఛన్ల సొమ్ము పంపిణీలో చేతివాటం ప్రదర్శించాడు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.100	రూ.120
రెండోరకం	రూ.60	రూ.90

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 422 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

8న జెడ్పీ సమావేశం

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లా ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం మే 8వ తేది ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 వరకు నిర్వహించనున్నట్లు జెడ్పీ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఓబులమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని జెడ్పీటీసీ సభ్యులు, వైఎస్సార్, అన్నమయ్య జిల్లా అధికారులు సమావేశానికి హాజరు కావాల్సి ఉంటుందని తెలిపారు.

మెడికల్ అండ్ హెల్త్ డీడీగా శేఖర్

కడప రూరల్: వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్-4 డిప్యూటీ డైరెక్టర్‌గా వై.శేఖర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కడప సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉన్న ఈయన .. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం డీడీగా అదనపు బాధ్యతలు చేపట్టారు.

పీహెచ్‌ఎన్ పదోన్నతులు ప్రశాంతం

కడప రూరల్: వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్-4 పరిధిలో మంగళవారం నిర్వహించిన పదోన్నతుల కౌన్సెలింగ్ ప్రశాంతంగా ముగిసింది. 22 మంది ఎంపీహెచ్‌ఎస్ (ఎఫ్)లకు పీహెచ్‌ఎన్ (ఎన్‌టీ)లుగా పదోన్నతి కల్పించారు. ఈ కౌన్సెలింగ్‌కు 22 మందికి గాను 18 మంది ప్రమోషన్‌లు పొందారు. నిబంధనల ప్రకారం పదోన్నతులు కల్పించినట్లు ఆ శాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రామగిడ్డయ్య తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ భక్తవత్సలం, సూపరిండెంట్ వెంకటసుబ్బమ్మ, సీనియర్ అసిస్టెంట్స్ వనీష, బత్తనయ్య తదితరులు పాల్గొన్నారు.

సహజసిద్ధంగా పండ్లను మాగబెట్టాలి



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్

రాయచోటి జగదాంబసెంటర్: మామిడి పండ్లను సహజ సిద్ధంగా మాగబెట్టాలని, కాల్షియం కార్బైడ్ వాడకూడదని అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్ పేర్కొన్నారు. మంగళవారం రాయ చోటి పట్టణంలోని కలెక్టరేట్ కార్యాలయంలో మామిడి వ్యాపారస్తులు, మామిడి రైతులతో కాల్షి యం కార్బైడ్‌ను నిరోధించడంపై జిల్లా స్థాయి కమిటీ సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ కాల్షియం కార్బైడ్‌ను ఉపయోగించి మామిడిపండ్లను మాగబెట్టే ప్రక్రియను నిరోధించాలన్నారు. వ్యవసాయ మార్కెట్‌యార్డులలోనే ఎక్కువ సంఘటనలు జరుగుతున్నాయన్నారు. మార్కెట్‌యార్డు ప్రాంగణంలో కృత్రిమంగా పండ్లను మాగబెట్టడానికి కాల్షియం కార్బైడ్ కల్తీని ఉపయోగిస్తే దానికి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. సహజసిద్ధంగా సహజ హార్మోన్ ఎథిలీన్ గ్యాస్ స్ప్రే చేయడం ద్వారా మామిడి పండ్లను మాగబెట్టవచ్చ న్నారు. రయిపెనింగ్ చాంబర్ల ద్వారా ఎథిలీన్ హార్మోన్ ఉపయోగించి మాగబెట్టవచ్చన్నారు. శీతల గిడ్డంగుల్లో కూడా ఎథిలీన్ హార్మోన్ ఉపయోగించి మామిడి పండ్లను మాగబెట్టవచ్చని తెలిపారు. రయిపెనింగ్ ఛాంబర్లను రైతులు, వ్యాపారస్తులు వినియోగించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, మామిడి రైతులు, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

సివిల్ పవర్

మనసు మూలన ఓ 'లక్ష్యం' చేరింది..
మనిషిలో 'నిర్లక్ష్యం' దూరమైంది..
'తొలి' అడుగులు తడబడ్డాయి..
మలి అడుగులు విజయానికి
దగ్గరగా వచ్చి ఆగిపోయాయి..
పట్టుదల పంతం రెట్టింపైంది..
వారి కృషికి.. చిత్తశుద్ధి తోడైంది...
ఆకాశమంత లక్ష్యం చిన్నబోయింది..
విజయం ఒళ్లోకొచ్చి వాలింది.. అవును..
'యూపీఎస్సీ' ఫలితాల్లో మనోళ్లు మెరిశారు..
'సివిల్' సంద్రాన్ని దాటి.. విజయ తీరాలకు
చేరారు..ముగ్గురు విజేతలై జిల్లా ఖ్యాతిని
ఇనుమడించారు. –సాక్షి ప్రతినిధి, కడప

- సివిల్స్‌కు ఎంపికైన ముగ్గురు జిల్లావాసులు
- పట్టుదలతో చదివి కలెక్టర్ కల సాకారం



చెన్నంరెడ్డి శివగణేష్‌రెడ్డి @ 119



చెన్నంరెడ్డి శివగణేష్‌రెడ్డి



కుటుంబ సభ్యులతో శివగణేష్‌రెడ్డి

కడప మండలం ఆలంఖాన్‌పల్లెకు చెందిన చెన్నంరెడ్డి మల్లికార్జునరెడ్డి, ఇందిరా ప్రియదర్శిని కుమారుడు చెన్నంరెడ్డి శివగణేష్ రెడ్డి సివిల్స్ ఫలితాల్లో ఆల్ ఇండియాస్థాయిలో 119వ ర్యాంకు సాధించారు. తల్లిదండ్రుల కలను నెరవేర్చడంతో పాటు ఊరి పేరును నిలబెట్టాడు. శివగణేష్‌రెడ్డి 1 నుంచి 10వ తరగతి వరకు కడప బాలవికాస్ హైస్కూల్లో చదివాడు. ఇంటర్మీడియట్‌ను నెల్లూరు నరసింహకొండ నారాయణ కళాశాలలో పూర్తి చేశాడు. తరువాత బీటెక్ హైదరాబాదు ఐఐటీలో పూర్తి చేశారు. తరువాత సివిల్స్ కోచింగ్‌ను ఢిల్లీలో తీసుకున్నాడు.

- తొలిసారి సివిల్స్ రాసినప్పుడు ర్యాంకు రాలేదు. రెండవసారి ఇంటర్వ్యూ వరకు వెళ్లి రెండు మార్కులతో వెనుదిరిగాడు. పట్టు వదలని విక్రమార్కుడిలా మూడవ సారి మరింత గట్టిగా ప్రయత్నించి 119వ ర్యాంకు సాధించాడు. చెన్నంరెడ్డి శివగణేష్‌రెడ్డి తండ్రి మల్లికార్జునరెడ్డి గతంలో కడప నగర శివార్లలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తూ ఉండేవారు. తరువాత ఉద్యోగాన్ని మానేసి వ్యవసాయం చేస్తూ పిల్లలను చదివించుకునేవాడు. శివగణేష్‌రెడ్డి చెల్లెలు శివజ్యోతిక బీటెక్ పూర్తి చేసి ఎంటెక్ చేసేందుకు ప్రిపేర్ అవుతోంది. శివగణేష్‌రెడ్డి సివిల్స్‌లో 119 ర్యాంకు సాధించడంపై తల్లితండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.
- కడప బాలవికాస్ హైస్కూల్ పూర్వపు విద్యార్థి అయిన చెన్నంరెడ్డి శివగణేష్‌రెడ్డి 119వ ర్యాంకు సాధించడంపై పాఠశాల డైరెక్టర్ గంగయ్య, కరస్పాండెంట్ సుబ్బరాయుడు ఆనందం వ్యక్తం చేశారు.

ధనుష్ @ 232



పూల ధనుష్

కడప ఎడ్యుకేషన్: కడప నాగరాజుపేటకు చెందిన పూల శ్రీనివాసులు, నాగమణి కుమారుడు పూల ధనుష్ సివిల్స్ ఫలితాల్లో 232వ ర్యాంకు సాధించాడు. ఈయన ప్రస్తుతం ఐడీఏఎస్(డిఫెన్స్) సర్వీసెస్‌లో సిమ్లాలో ప్రొబేషనరీ ఆఫీసర్‌గా శిక్షణలో ఉన్నాడు. వీరి తల్లిదండ్రులు ఉద్యోగరీత్యా హైదరాబాదులో స్థిరపడ్డారు. పూల ధనుష్ విద్యాభ్యాసమంతా హైదరాబాదులోనే పూర్తయింది. తరువాత సివిల్స్‌కు ఢిల్లీలో కోచింగ్ తీసుకుని నాలుగో ప్రయత్నంలో 232వ ర్యాంకు సాధించాడు.

నేలటూరు శ్రీకాంత్ రెడ్డి @ 151



శ్రీకాంత్ రెడ్డి



శ్రీకాంత్‌రెడ్డి తల్లిదండ్రులు సుబ్బారెడ్డి, సావిత్రి

నేలటూరు శ్రీకాంత్‌రెడ్డికి చిన్నప్పటి నుంచి చదువంటే మక్కువ. తల్లిదండ్రుల కష్టానికి తగ్గట్లు పట్టుదలగా చదువులో రాణించాడు. సాధారణ కుటుంబం నుంచి సివిల్స్ పరీక్షలో 151వ ర్యాంకు సాధించి శభాష్ అనిపించాడు. తొలి, మలి ప్రయత్నాల్లోనే మెయిన్స్, ఇంటర్వ్యూ వరకూ వెళ్లిన ఆయన మూడో ప్రయత్నంలో సివిల్స్ సాధించారు. చెన్నూరుకు చెందిన నేలటూరు సుబ్బారెడ్డి, సావిత్రి దంపతులకు శ్రీకాంత్‌రెడ్డి, శ్రీలత సంతానం. శ్రీకాంత్‌రెడ్డి పదో తరగతి వరకూ కడప నాగార్జున హైస్కూల్‌లో చదివారు. ఇంటర్మీడియట్ నెల్లూరు లోని నరసింహకొండ వద్ద ఉన్న నారాయణ కళాశాల్లో చదివారు. ఇండోర్‌లో ఐఐటీ పూర్తి చేశారు. ఐఐటీ తర్వాత డెలాయిట్ కన్సల్టెంట్‌లో ఏడాది ఉద్యోగం చేశారు. ఆపై సివిల్స్ సాధించాలనే లక్ష్యంతో బెంగుళూరు కేంద్రంగా సన్నాహాలు చేశారు. తొలి, మలి ప్రయత్నాల్లో మెయిన్స్ పూర్తి చేసి ఇంటర్వ్యూ వరకూ వెళ్లారు. మూడో ప్రయత్నంలో ఇంటర్వ్యూలో నెగ్గి 151 ర్యాంకు సాధించి ఐఏఎస్ కావాలనే లక్ష్యం నెరవేర్చుకున్నారు. బుధవారం ఢిల్లీలో ఐఎఫ్‌ఎస్ ఇంటర్వ్యూ కోసం వేచిఉన్న శ్రీకాంత్‌రెడ్డికి సివిల్స్ ఫలితాలు సంతోషాన్ని ఇచ్చాయి. ఐఏఎస్ సాధించిన నేపథ్యంలో ఐఎఫ్‌ఎస్ ఇంటర్వ్యూకు మరొకరికి ఛాన్సు వస్తుందనే ఉద్దేశ్యంతో ఢిల్లీ నుంచి స్వగ్రామానికి వెనుతిరిగారు. ఈసందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ చదువుకు కుటుంబ నేపథ్యం అడ్డురాదని, లక్ష్యసాధన దిశగా పట్టుదలతో రాణించాలన్నారు. బేసిక్స్‌పై సంపూర్ణంగా పట్టు సాధించాలన్నారు. లక్ష్యాన్ని నెరవేర్చుకునేందుకు అదే స్థాయిలో కష్టపడాలన్నారు. శ్రీకాంత్ రెడ్డి తండ్రి సుబ్బారెడ్డి మాట్లాడుతూ శ్రీకాంత్‌రెడ్డి చిన్నప్పటి నుంచి పట్టుదలతో చదువులో రాణించారన్నారు. ఉన్నతస్థాయికి చేరుకుంటారనే ఆశాభావం ఉండేదని, చదువుకు ఎలాంటి ఆటంకం లేకుండా జాగ్రత్తపడ్డామని తెలిపారు. సివిల్స్ ఫలితాల్లో ఐఏఎస్ సాధించారని తెలియగానే చాలా సంతోషపడ్డామన్నారు.

గ్రామీణ రైతులకు వ్యవసాయ ఫలాలు అందేలా కృషి

వ్యవసాయ శాఖ జేడీఏ చంద్రనాయక్



ఏఓ, సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న జేడీఏ చంద్రనాయక్

రాజంపేట రూరల్: గ్రామీణ స్థాయిలో వ్యవసాయం చేస్తున్న రైతులకు అండగా ఉండి వారికి వ్యవసాయ ఫలాలు అందేలా కృషి చేయండని వ్యవసాయ శాఖ జేడీఏ చంద్రనాయక్ ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో మంగళవారం రాజంపేట, నందలూరు, పెనగలూరు మండలాలలోని అధికారులు, సిబ్బందితో జేడీఏ చంద్రనాయక్ సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం అమలులో ఉన్న వ్యవసాయ యాంత్రీకరణ , రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు పని తీరుపై ఆరా తీశారు. వీటిపై రైతులకు ఎంత మటుకు అవగాహన కల్పించారో వివరాలు అడిగి తెలుసుకున్నారు. వేసవిలో రబీ పంటలు కోసిన పొలాలలో వివిధ రకాల పంటలు వేయించాలని సూచించారు. ప్రతి రైతు సేవ కేంద్రం పరిధిలో భూసార పరీక్ష కోసం నమూన సేకరణ మే 15 లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. కిసాన్ డ్రోన్‌లపై 80 శాతం సబ్సిడీ వస్తుందని రైతులకు తెలియజేయాలని పిలుపునిచ్చారు. ప్రకృతి వ్యవసాయం అమలు గురించి గ్రామాలలో పని చేస్తున్న సిబ్బందితో సమీక్షించాలని ఏఓలను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో ఇంచార్జి ఏడీఏ కవిత, రాజంపేట, నందలూరు, పెనగలూరు మండలాల ఏఓలు జీ.రాజకుమారి, జీ.మల్లికార్జున, ఎస్‌కేపీ సుబ్రమణ్యం, టెక్నకల్ ఏఓలు వేంకటమోహన్, రమేష్ రాజు, పవన్, రాజంపేట, నందలూరు, పెనగలూరు మండలాల సిబ్బంది పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనతోనే జిల్లా అభివృద్ధి

జిల్లా కలెక్టర్ శ్రీధర్



పరిశ్రమల ఏర్పాటుపై జిల్లా అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి: పరిశ్రమల స్థాపనతోనే అన్నమయ్య జిల్లా అభివృద్ధి సాధ్యమని, జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే వారికి అవసరమైన ప్రోత్సాహం అందించాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో జిల్లా పారిశ్రామిక ఎగుమతుల ప్రమోషన్ కమిటీ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే వారికి అవసరమైన ప్రోత్సాహం అందించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే వారికి బ్యాంకర్లు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నిర్దేశిత లక్ష్యాల మేరకు బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. ఏపీఐఐసీ ద్వారా ప్లాట్ల కేటాయింపులో రెవెన్యూశాఖ, ఏపీఐఐసీ జెడ్‌ఎంలు సమన్వయం చేసుకొని త్వరగా ప్లాట్లను కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సింగల్ డెస్క్‌పోర్టల్ క్లియరెన్స్, క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్‌పై రాయితీ, పావలా వడ్డీ పథకం కింద వడ్డీ రాయితీ, పీఎం ఈజీసీ కార్యక్రమంలోని వివిధ అంశాలు, పీఎం విశ్వకర్మ యోజన, ఏపీఐఐసీ వారి ఆధ్వర్యంలో జరిగే ప్లాట్ల కేటాయింపు తదితర అంశాలపై జిల్లా పరిశ్రమల శాఖ అధికారి కృష్ణారావు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. సమావేశంలో ఉమ్మడి కడప జిల్లా జెడ్‌ఎం శ్రీనివాసమూర్తి, ఏపీఐఐసీ జెడ్ఎం మూర్తి, ఎల్డీఎం, డీఐఏ అసోసియేషన్ సభ్యులు రాజశేఖర్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిమ్న వర్గాల అభ్యున్నతికి చర్యలు: దళితులు వివక్షకు గురి కారాదని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో సామాజిక రుగ్మతలను సమూలంగా తొలగించడమే లక్ష్యంగా పారదర్శకంగా, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. మంగళవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సాంఘీక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా విజిలెన్సు మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీకి సంబంధించిన కేసులలో బాధితులకు న్యాయంతోపాటు త్వరితగతిన పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్లను, ఆర్డీఓను, అడిషనల్ ఎస్పీని, డీఎస్పీలను కలెక్టర్ ఆదేశించారు. భూ సమస్యల విషయంలో వాటిపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. నిమ్న వర్గాల ప్రజలపై వివక్ష, అఘాయిత్యాలు జరగకుండా పోలీసు, రెవెన్యూ యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. వారి అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల అవకాశాలను కల్పిస్తోందని పేర్కొన్నారు. సమావేశంలో జేసీ ఆదర్శ రాజేంద్రన్, జిల్లా సాంఘీక సంక్షేమశాఖ అధికారి జయప్రకాష్, మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్, డీఆర్ఓ మధుసూదన్ రావు, రాయచోటి ఆర్డీఓ శ్రీనివాస్, రాజంపేట, మదనపల్లి డివిజన్ల డీఎస్పీలు, డివిఎంసీ కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సుగవాసి సైలెంట్!

- చమర్తి పెత్తనంపై వ్యతిరేకత
- రాజంపేట దేశంలో వర్గపోరు
- వర్గాలు లేవంటూ కలరింగ్
- అధిష్టానంకు కాపుల వ్యతిరేకత
- ఇన్‌చార్జి పెండింగ్‌లో పెట్టిన అధిష్టానం

రాజంపేట: తెలుగుదేశం పార్టీ నుంచి సార్వత్రిక ఎన్నికల్లో రాజంపేట నియోజకవర్గ స్థానం నుంచి పోటీ చేసిన సుగవాసి సుబ్రమణ్యం సైలెంట్ అయ్యారంటే.. అవుననే చెప్పాల్సివస్తోంది. గత కొద్దినెలలుగా అధికారపార్టీకి దూరంగా కొనసాగుతున్నారు. గత ఎన్నికల్లో సుగవాసికి అధిష్టానం టికెట్ ఇచ్చి పోటీ చేయించినా అధిష్టానం ఆయనను ఇప్పుడు పెద్దగా పట్టించుకోవడంలేదన్న వాదన టీడీపీలో హాట్‌టాపిక్‌గా కొనసాగుతోంది. నియోజకవర్గంలోని ఒంటిమిట్ట రాములోరి కళ్యాణానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వస్తే ఆ ప్రాంతాల్లో ఎక్కడ కూడా సుగవాసి కనిపించలేదు. ఆయన పార్టీ వీడనున్నారా? అన్న సందేహాలు రేకెత్తిస్తున్నాయి. రాజంపేటలో కాపు (బలిజ)సామాజికవర్గానికి సరైన ప్రాధాన్యత లేదన్న భావనలు పుట్టుకొస్తున్నాయి.

రాజంపేట వైపు మళ్లీ బత్యాల చూపు?
మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయుడు రైల్వేకోడూరుకే పరిమితమయ్యారు. సుగవాసి సుబ్రమణ్యం గత కొద్దిరోజులుగా పార్టీకి దూరంగా..నియోజకవర్గం పార్టీ కార్యక్రమానికి రాకపోవడంతో బలిజ సామాజికవర్గం మదనపడుతోంది. బత్యాల చెంగల్రాయుడు, సుగవాసి సుబ్రమణ్యంలు రాజంపేట టీడీపీలో పట్టుకోల్పోయిన తరుణంలో ఆయన వెంట నడిచిన ఆయన సామాజికవర్గ నేతలు, అభిమానులు మాత్రం నిస్తేజంగా ఉండిపోయారు. మళ్లీ బత్యాల చూపు రాజంపేట వైపును మళ్లిస్తుందా అనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.



సుగవాసి

ఇన్‌చార్జి ఎవరో తేల్చని అధిష్టానం
రాజంపేట టీడీపీలో కుల వర్గపోరు, అంతర్గత కుమ్ములాటలు జరుగుతూనే ఉన్నాయి. అధిష్టానం ఇన్‌చార్జి ఎవరో తేల్చుకోలేకుంది. ఇన్‌చార్జి రేసులో ఉన్న వారితో అధికారులు తలపట్టుకుంటున్నారు. ఏ నేత వద్దకు పోతే, మరోనేతకు వ్యతిరేకమవుతామని, ఎవరి దగ్గరికి పోకుంటే పోలా అనే భావనలో పార్టీ క్యాడర్ కొనసాగుతోంది. సీఎం బర్త్‌డే వేడుకలను కలిసికట్టుగా కాకుండా చమర్తి జగన్‌మోహన్‌రాజు, బత్యాల చెంగల్రాయుడు, మేడా విజయశేఖర్‌రెడ్డి వేర్వేరుగా చేసుకున్నారు. మహానాడు తర్వాత ఇన్‌చార్జి ప్రకటిస్తారా? ముందుగానే ప్రకటిస్తారా అనేది టీడీడీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

అధిష్టానం ఎటువైపు

పోటీ చేసి ఓడిపోయిన సుగవాసి సుబ్రమణ్యంను కాదని, పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్మోహన్‌రాజుకు అధిష్టానం ప్రాధాన్యత ఇస్తున్న క్రమంలో బలిజ వర్గాలు జీర్ణించుకోలేకున్నాయి. రాజంపేట దేశంపార్టీలో వర్గపోరు అంతర్గతంగా కొనసాగుతోంది. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగాల విషయంలో చేతివాటం ప్రదర్శించారని ఆరోపణలు ఉన్నాయి. రాజంపేట ప్రాంతీయ వైద్యశాలలో ఔట్‌సోర్సింగ్ నియామకాల్లో కూడా ఓ నేత చేయి తడిపారనే ఆరోపణలు ఆ పార్టీ వర్గాలే బహిరంగంగానే చెప్పుకుంటున్నాయి.

వర్గాలు లేవని కలరింగ్



చమర్తి జగన్‌మోహనరాజు

రాజంపేట నియోజకవర్గంలో వర్గాలు లేవని చమర్తి జగన్‌మోహన్‌రాజు కలరింగ్ ఇచ్చుకునేదారిలో ఉన్నాడు. అందరినీ కలవడం మేమంతా ఒక్కటే అని మీడియా గ్రూపులలో పెట్టుకోవడం కొనసాగుతోంది. అయితే వర్గాలు మాత్రం నివురుగప్పిన నిప్పులా ఉన్నాయి. ఇటీవల బలిజ సామాజికవర్గానికి చెందిన నేతలు చమర్తి పెత్తనంను ఓర్వలేక, తమ అసంతృప్తిని వెల్లగక్కుతున్న తరుణంలో ఒకరో ఇద్దరో బలిజ నేతలతో ఫోటోలు దిగి అంతా ఒక్కటే అని చెప్పుకునే స్థితిలో చమర్తి ఉన్నారు. వర్గాల కుంపటి మధ్య పార్టీ క్యాడర్ ఎటు వెళ్లాలో తెలియక సైలెంట్ అయిన నేతలు బహిరంగంగానే తమ బాధను వ్యక్తం చేసుకున్నారు.

స్టెర్లింగ్ పోయే... పతంజలి వచ్చే..!

- హార్సిలీహిల్స్‌పై ప్రతినిధుల సర్వే, పరిశీలన
- ఈనెల 14న గది గదికి కొలతలు తీశారు
- అప్పనంగా అప్పగించేస్తారన్న అనుమానాలు
- కూటమి ప్రభుత్వం రాగానే ప్రయివేటు పల్లవి



ఈనెల 14న హార్సిలీహిల్స్‌పై పరిశీలనలు జరిపిన పతంజలి ప్రతినిధులు

బి.కొత్తకోట: బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై పతంజలి సంస్థ కన్నుపడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేసి ఆదాయం పెంచుకునే మార్గాలను అన్వేషించాల్సింది పోయి ఉద్యోగులకు ఆధార మైన వీటిని ప్రయివేటుకు అప్పగించేందుకు వెనుకాముందు చూడటం లేదు. దీనితో హార్సిలీహిల్స్ టూరిజం యూనిట్ పరిస్థితి ఎలా ఉందంటే ఎవరి కన్ను పడితే వాళ్లు అధికారికంగా రావడం పరిశీలించుకోవడం, వెళ్లడం జరుగుతోంది. ఇందులో భాగంగా తాజాగా పతంజలి సంస్థ ప్రతినిధులు ఈనెల 14న హార్సిలీహిల్స్ వచ్చి పరిశీలించి వెళ్లిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనితో ఇక్కడ పనిచేస్తున్న ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తం అవుతోంది.

స్టెర్లింగ్ వెనక్కు తగ్గింది..
హార్సిలీహిల్స్ టూరిజం యూనిట్‌ను కూటమి ప్రభుత్వం చెన్నైకి చెందిన అతిథి సంస్థ స్టెర్లింగ్‌కు అప్పగించేందుకు ప్రయత్నాలు సాగాయి. అధికారికంగా ఆ సంస్థ ప్రతినిధులు పరిశీలనలు నిర్వహించుకునేలా వారి పర్యటన వివరాలతో ఈడీ ఆదేశాలు జారీ చేశారు. ఈ వ్యవహారం సాక్షిలో ప్రచురితం కావడంతో పర్యాటకశాఖలో కలకలం రేపింది. ఉద్యోగుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడం, ఉద్యోగ సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. దీనితో స్టెర్లింగ్ సంస్థ పర్యాటక కేంద్రాలను దక్కించుకునే విషయంలో వెనక్కు తగ్గింది. దీనితో ప్రయివేటు చేతికి వెళ్లదని అంతా ఊపిరి పీల్చుకున్నారు. అంతే ఈలోగా మరో పిడుగులాంటి వార్త కలవరానికి గురిచేస్తోంది.

పతంజలి వచ్చింది..
హార్సిలీహిల్స్‌పై టూరిజం యూనిట్ మొత్తాన్ని పతంజలి సంస్థ ప్రతినిధులు పరిశీలించడంపై అనుమానాలు రేకెత్తుతున్నాయి. స్టెర్లింగ్ వెనక్కు వెళ్లిందన్న ఆనందం ఉద్యోగుల్లో కొన్నాళ్లయినా గడవకుముందే పతంజలి ప్రతినిధులు కొండపై అడుగు పెట్టం ఆందోళనకు గురిచేస్తోంది. ఈనెల 14న పతంజలి సంస్థకు చెందిన ప్రతినిధులు కొండకు వచ్చారు. టూరిజం యూనిట్ పరిధిలో ఎన్ని అతిథి గృహాలు ఉన్నాయి, అవి ఏ స్థితిలో, ఎలా ఉన్నాయి అన్నది పరిశీలిస్తూనే ఒక్కో గదికి సంబంధించిన కొలతలు తీసుకున్నారు. ఖాళీస్థలాలు, మొత్తం ఎన్ని ఎకరాల్లో యూనిట్ నిర్వహణ సాగుతోంది, ఇక్కడి పరిస్థితులను తెలుసుకున్నారు. వీరి పరిశీలనకు జిల్లా పర్యాటకశాఖ అధికారి నాగభూషణం దగ్గరుండి వివరాలను తెలియజేశారు. దీనిపై ఆయన మాట్లాడుతూ పతంజలి సంస్థ కొండపై కార్యకలాపాల నిర్వహణ కోసం పరిశీలనలు జరిపిందని, దీనిపై ప్రభుత్వమే నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు.

అందరి కన్ను కొండపైనే..

హార్సిలీహిల్స్‌పై అందరి కన్ను పడుతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.10.50 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టింది. పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేసింది. గదులను స్టార్ హోటల్ తరహాలో ఆధునీకరించింది. ఇంకా జరగాల్సిన పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇలా కొండను గత ప్రభుత్వం అభివృద్ధి చేస్తే.. కూటమి ప్రభుత్వం సంస్థలు దీన్ని దక్కించుకునేందుకు పోటీ పడుతున్నాయి. స్టెర్లింగ్ సంస్థ తప్పుకోగా, ఇప్పుడు పతంజలి వచ్చింది, ఇంకా ఎవరైనా వస్తారా అన్నది ఉత్కంఠగా ఉన్నా..ప్రభుత్వ చర్యలను ఉద్యోగులు ఖండిస్తున్నారు.

హార్సిలీహిల్స్‌పై వెలుగులు

సాక్షి ఎఫెక్ట్..

బి.కొత్తకోట: పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై మంగళవారం సాయంత్రం నుంచి హైమాస్ వెలుగులు వెదజల్లుతున్నాయి. గతనెల 23న సాక్షిలో హార్సిలీహిల్స్‌కు వెలుగులు ఎప్పుడు అన్న శీర్షికన ప్రచురితమైన కథనంపై మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ స్పందించారు. కథనం ప్రచురితమైన రోజే సబ్‌కలెక్టర్ స్పందించి విద్యుత్‌శాఖ, హైమాస్ లైట్ల కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనితో స్పందించిన వారు కొండకు చేరుకుని లైట్లు ఎందుకు వెలగడం లేదని పరిశీలించి మరమ్మతులు చేపట్టి ఎట్టకేలకు మంగళవారం పనులు పూర్తి చేయడంతో హార్సిలీహిల్స్‌పై హైమాస్ లైట్లు కాంతిని నింపాయి.



వెలుగుతున్న హైమాస్ లైట్లు

క్లుప్తంగా

ఇంటర్ ఫెయిలయ్యానని విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : ఇటీవల విడుదలైన ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ఫెయిలయ్యానని ఓ విద్యార్థిని ఆత్మహత్యకు యత్నించిన సంఘటన మంగళవారం పుంగనూరు మండలంలో జరిగింది. చంద్రమాకులపల్లె పంచాయతీ ఎల్ఆర్ బైలు గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థిని (18) ఇంటర్‌లో రెండు సబ్జెక్టులలో ఫెయిలైంది. ఈ విషయమై తల్లిదండ్రులు మంగళవారం మందలించడంతో మనస్తాపం చెంది విష ద్రావణం తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

జేసీబీ ఢీకొని వృద్ధుడికి తీవ్ర గాయాలు

మదనపల్లె : జేసీబీ ఢీకొని వృద్ధుడు తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం పీటీఎం మండలంలో జరిగింది. పోతుపేట గ్రామానికి చెందిన ఓబులప్ప (75) ప్రధాన రహదారి పక్కనే ఉన్న రోడ్డుపైకి రాగా వేగంగా వచ్చిన జేసీబీ ఢీకొంది. ప్రమాదంలో ఓబులప్ప తీవ్రంగా గాయపడగా గమనించిన కుటుంబ సభ్యులు బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్య

మదనపల్లె : ఆటో డ్రైవర్ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం మదనపల్లెలో జరిగింది. అమ్మచెరువుమిట్ట ఏసీ గోడౌన్ సమీపంలో నివసిస్తున్న ఫక్రుద్దీన్ కుమారుడు షేక్ షబ్బీర్ (42) ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ జీవిస్తున్నాడు. అతనికి భార్య ఖదీరా, నలుగురు పిల్లలు ఉన్నారు. మంగళవారం మధ్యాహ్నం ఇంటికి వచ్చిన షబ్బీర్ కుటుంబ సమస్యల కారణంగా ఇంట్లో భార్యతో గొడవపడ్డాడు. తీవ్ర మనస్తాపం చెంది ఇంట్లోనే మరో గదిలోకి వెళ్లి చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన అత్యవసర విభాగ వైద్యులు అప్పటికే షబ్బీర్ మృతి చెందినట్లు నిర్ధారించారు.

ద్విచక్రవాహనం దగ్ధం



రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని రంగనాయకులపేటలో నివాసముంటున్న షేక్ అఫ్సర్ అనే వ్యక్తికి చెందిన ద్విచక్ర వాహనాన్ని మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. రోజులాగే బైకును సోమవారం రాత్రి ఇంటి బయటే ఉంచానని బాధితుడు తెలిపారు. ఉదయం చూసే సరికి దగ్ధమై ఉండటంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

కరెంటు కష్టాలు!



నూనివారిపల్లి రహదారిలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎగిసిపడుతున్న మంటలు



నూనివారిపల్లి రహదారిలో కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

- రాజంపేట పట్టణంలోని నూనివారిపల్లిలో 12 గంటలు అంతరాయం
- తాళ్లపాకలో 3 రోజులుగా విద్యుత్ కోత

రాజంపేట రూరల్ : రాజంపేట పట్టణం, మండల పరిధిలో నిరంతరం విద్యుత్ సరఫరా చేయడంలో విద్యుత్‌శాఖ విఫలమైందని ప్రతి రోజు ప్రజలు ఆరోపిస్తూనే ఉన్నారు. విద్యుత్ సరఫరా లేక ఇబ్బంది పడటం ప్రజలకు నిత్యకృత్యంగా మారిపోయింది. ప్రతి 2వ శనివారం అభివృద్ధి పేరుతో విద్యుత్ సరఫరాను గంటల కొద్ది నిలిపేస్తున్నారు. అయినప్పటికీ ప్రతి రోజు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగటం అనేది కొనసాగుతూనే ఉంది. వేసవి కాలం రావటంతో ఈ సమస్య మరింత జఠిలమైంది. అది ఎంతలా అంటే ట్రాన్స్ ఫార్మర్లు పేలిపోయేటంత. పట్టణం, గ్రామీణ ప్రాంతాలలో



తాళ్లపాకలో కాలిపోయిన రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్

ఏర్పాటు చేసిన పలు ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ లేకపోవటం ప్రధాన సమస్య. అక్కడ ఏపుగా చెట్లు పెరిగినప్పటికీ పట్టించుకోవటం లేదనేది వినియోగదారుల అభిప్రాయం. ఈ విధంగా ఉండటంతో ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోతున్నాయి. మండల పరిధిలోని తాళ్లపాక గ్రామంలో ఆదివారం ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. అప్పటి నుంచి అక్కడ నూతనంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయకపోవటంతో అక్కడి ప్రజలు తాగునీరు లేక విలవిల్లాడిపోతున్నారు. అదే విధంగా ఉక్కపోత తట్టుకోలేక వృద్ధులు, చిన్నారులు నరక యాతన అనుభవిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటులో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంపై అక్కడి ప్రజలు గ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని నూనివారిపల్లి రహదారిలో మంగళవారం వేకువ జామున 1 గంట సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఆ మంటలకు సమీప గృహాల వారు భయభ్రాంతులయ్యారు. అప్పటి నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. పట్టణంలో దాదాపు 12 గంటలు విద్యుత్ సరఫరా లేకపోవటంతో ప్రజలు వేడిమికి అల్లాడి పోయారు. విద్యుత్ నిరంతర సరఫరాలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

మండల పరిషత్ స్థలాల్లో ఆక్రమణలు తొలగించండి

జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు

గుర్రంకొండ : ఎన్‌హెచ్ 340 జాతీయ రహదారికి పక్కనే ఉన్న మండల పరిషత్ కార్యాలయానికి సంబంధించిన స్థలాల్లో ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించాలని జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు ఆదేశించారు. సదరు స్థలాల్లో శాశ్వత భవనాలు నిర్మించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయ రికార్డులను పరిశీలించారు. మండలంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. సమస్యల పరిష్కారానికి తగిన ప్రతిపాదనలను పంపించాలన్నారు. అనంతరం కార్యాలయానికి సమీపంలో ఆక్రమణలకు గురైన మండల పరిషత్ కార్యాలయ స్థలాలను అధికారులతో కలిసి పరిశీలించారు. సుమారు 10 సెంట్లు మండల పరిషత్ కార్యాలయానికి సంబంధించిన స్థలం రోడ్డుపక్కనే ఉందని అధికారులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు.



మండల సమస్యలను తెలుసుకుంటున్న జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు

ప్రభుత్వ స్థలాల్లో శాశ్వత భవనాలను నిర్మిస్తే అటు మండల పరిషత్‌కు, ఇటు జెడ్పీకి శాశ్వతంగా ఆదాయం సమకూరుతుందన్నారు. వెంటనే భవన నిర్మాణాలకు తగినట్లుగా ప్రతిపాదనలు సిద్ధం చేసి జెడ్పీకి పంపించాలన్నారు. రూ. 30 లక్షల మేర మొదటి విడతగా నిర్మాణ నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఎంపీడీఓ వెంకటేశులు, ఈఓపీఆర్‌డీ బ్రహ్మానందరెడ్డి, ఏఓ నాగశివారెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కీచక ఉపాధ్యాయుడిపై విచారణ

కలకడ : విద్యార్థినికి అర్ధరాత్రి అసభ్యకర వాట్సా ప్ మెసేజ్‌లు పెట్టి వేధించిన కీచక ఉపాధ్యాయుడిపై మంగళవారం విచారణ చేపట్టారు. జిల్లా వి ద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు స్థానిక ఆదర్శ పాఠశాలలో మంగళవారం కురబలకోట మండల విద్యాశాఖ అధికారి ద్వారక, కలకడ మండలం కోన క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడు మోడెం చెంగల్‌రాయుడు విచారణ చేపట్టారు. కలకడ ఆ దర్శ పాఠశాల ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ వి ద్యార్థినికి అసభ్యకరంగా వాట్సాప్ చేయడంతో విధుల నుంచి తాత్కాలికంగా తొలగించిన విషయం తెలిసిందే. మంగళవారం ఉపాధ్యాయుడు చంద్రశేఖర్, విద్యార్థిని, ఆ పాఠశాల ప్రిన్సిపాల్ మల్లంగ్‌షావలీని విచారించి ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు విచారణ అధికారులు తెలిపారు.

వీఆర్ఓపై దాడి

గాలివీడు : గాలివీడు మండలం పందికుంట వీఆర్‌ఓ యర్రకదిరిగాండ్ల జయన్న విధి నిర్వహణలో ఉండగా నూలివీడు వెటర్నరీ అసిస్టెంట్ కానాల హేమసుందర్ రెడ్డి, టీడీపీ నాయకుడు కానాల రామచంద్రారెడ్డి దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీఆర్‌ఓ కథనం మేరకు మంగళవారం మధ్యాహ్నం తహసీల్దార్ కార్యాలయంలో జయన్న విధుల్లో ఉండగా పందికుంట గ్రామం దేవరపల్లెకు చెందిన కానాల రామచంద్రా రెడ్డి సాయంత్రం కార్యాలయం వద్దకు వచ్చి రామాపురం మండలం అసనాపురం గ్రామం నగిరెడ్డిపల్లెకు చెందిన పొజిషన్ సర్టిఫికెట్లు చేయాలని బెదిరించాడు. ఇది తమ పరిధిలో లేవని చెప్పడంతో రామచంద్రా రెడ్డి ఆయన కుమారుడు హేమ సుందర్ రెడ్డి తనపై దాడి చేశారని వీఆర్‌ఓ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

వివాహిత మృతిపై కేసు

బి.కొత్తకోట : కడుపు నొప్పితో ఆస్పత్రికి వైద్యం కోసం వెళ్లిన యువతి మృతి చెందిన ఘటనపై మృతురాలి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని సీఐ జీవన్ గంగనాథ్ బాబు మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు. బి.కొత్తకోట మండలం కోటావూరు పంచాయతీ బూదలవారిపల్లెకు చెందిన గాయత్రి (25), భర్త రాజేష్‌తో కలిసి బెంగళూరులో ఉంటోంది. గర్భిణి కావడంతో ప్రసవం కోసం పుట్టింటికి వచ్చి స్థానిక సీహెచ్‌సీలో బిడ్డకు జన్మనిచ్చింది. తర్వాత పిల్లలు కలగకుండా ట్యూబెక్టమీ ఆపరేషన్ చేయించుకుంది. ఈనెల 19న గాయత్రికి కడుపునొప్పి రావడంతో స్థానిక వైద్యుల సూచన మేరకు పెద్దాసుపత్రికి వెళ్లాలని సూచించగా వెళ్లారు. అక్కడ వైద్యం పొందుతూ సోమవారం మృతి చెందింది. దీనిపై అనుమానం వ్యక్తం చేస్తూ సోదరుడు రెడ్డి ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అత్యాచార యత్నం కేసులో వ్యక్తి అరెస్టు



నిందితుడితో పోలీసు అధికారులు

రైల్వేకోడూరు అర్బన్ : మైనర్ బాలికపై అత్యాచార యత్నం, హత్యాయత్నం కేసులో రైల్వేకోడూరు మండలం రాఘవరాజుపురం దళితవాడకు చెందిన కూని వెంకటేశ్వర్లు అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ హేమసుందర్ రావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 19వ తేదీ తెల్లవారుజామున నిందితుడు ఓ మైనర్ బాలికపై అత్యాచార యత్నం చేసి చంపేందుకు ప్రయత్నించాడన్నారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచామన్నారు.

రోడ్డు ప్రమాదంలో భవన నిర్మాణ కార్మికుడికి తీవ్ర గాయాలు



గాయపడిన సోమశేఖర్

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో భవన నిర్మాణ కార్మికుడు తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం రాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. అంకిశెట్టిపల్లెకు చెందిన క్రిష్ణమూర్తి కుమారుడు సోమశేఖర్ (40) భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్నాడు. పనులు ముగించుకుని భార్య కొండమీదచెరువుతాండాలోని పుట్టింటిలో ఉండగా అక్కడికి వెళ్లేందుకు ద్విచక్రవాహంలో బయలుదేరాడు. మార్గమధ్యంలో బార్లపల్లె సమీపంలో ఎదురుగా వచ్చిన బస్సు ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అపస్మారస్థితిలోకి వెళ్లగా గమనించిన స్థానికులు బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

మదనపల్లెలో ఇద్దరు వీఆర్‌ఓలు సస్పెన్షన్

మదనపల్లె : మదనపల్లె మండలంలో పనిచేస్తున్న కొత్తవారిపల్లె -2 వీఆర్‌ఓ ఎం.భరత్, పెంచుపాడు వీఆర్‌ఓ కేఎం శ్రీనివాసులులను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 11న మదనపల్లె రెవెన్యూలో లంచాల జోరు శీర్షికన ఓ వీఆర్‌ఓ మరో పంచాయతీకి సంబంధించిన వ్యక్తుల వద్ద ఐదు లక్షల రూపాయలు భూమి మ్యూటేషన్ కోసం తీసుకోవడంపై వార్త ప్రచురితమైంది. బీకే పల్లె పంచాయతీకి మస్తాన్, ప్రసాద్ లు వీఆర్‌ఓలుగా ఉండగా, అదే పంచాయతీలోని సర్వేనెంబర్ 448 లోని 5.02 ఎకరాల భూమిని భాగ పరిష్కారాల్లో పొందిన భూమిని సానక వెంకటరమణారెడ్డి, సానక నాగరాజు రెడ్డి, సానక సుధాకర్ రెడ్డి ల పేర్లపై మ్యూటేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ విషయంలో కొత్త వారి పల్లెటు వీఆర్‌ఓగా పని చేస్తున్న భరత్ జోక్యం చేసుకొని ఐదు లక్షలు లంచం తీసుకున్నట్లు అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నాడు. దీంతో జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశించగా, తహసీల్దార్ ధనుంజయులు, సబ్ కలెక్టర్‌కు నివేదిక అందించారు. అనంతరం సబ్ కలెక్టర్ జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపారు. నివేదిక ఆధారంగా వీఆర్‌ఓ భరత్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా పెంచపాడు గ్రామ వీఆర్‌ఓగా పని చేస్తున్న కేఎం శ్రీనివాసులు సాధారణ విధులలో తీవ్ర నిర్లక్ష్యం చూపడం, నివేదికలు నిర్దేశించిన సమయంలోగా అందించకపోవడం, ఉన్నతాధికారుల సూచనలను ధిక్కరించడంతో విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

దొంగ పాసు పుస్తకాలతో మోసం చేశారు



బాధితుడు అన్నారపు నారాయణ

సుండుపల్లె : తహసీల్దార్ కార్యాలయంలో దొంగ పాసుపుస్తకాలు జారీ చేయించి తన వద్ద నుంచి వేల రూపాయలు నగదు వసూలు చేసినట్లు రైతు అన్నారపు నారాయణ తెలిపారు. ఆయన కథనం మేరకు సుండుపల్లె తహసీల్దార్ కార్యాలయంలో గతంలో పూజారి నాగన్న, అతని భార్య అటెండర్‌గా పని చేశారు. ప్రస్తుతం పూజారి నాగన్న సొంత బావమర్ది సుండుపల్లె తహసీల్దార్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్నాడు. అదే అదునుగా పూజారి నాగన్న గుండ్లపల్లె గ్రామ పంచాయతీ జేసీ కురవపల్లికి చెందిన అన్నారపు నారాయణ భూమికి పట్టా పాసు పుస్తకాలు ఇప్పిస్తానని చెప్పి అతని వద్ద నుంచి వేల రూపాయలు వసూలు చేశాడు. పాసు పుస్తకాలు జారీ అయిన తరువాత ఆన్‌లైన్‌లో చూసుకుంటే ఆ భూమికి సంబంధించిన సమాచారం లేదని తెలుసుకున్నారు. పూజారి నాగన్ననను నమ్మి డబ్బులు మోసపోయానని ఇంకా చాలా మంది బాధితులకు ఇలానే మోసం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయని బాధితుడు తెలిపారు.

మిగులు ఉపాధ్యాయులను ఉన్నత పాఠశాలలోనే కొనసాగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నోబెల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస రాజు

రాయచోటి టౌన్ : రాష్ట్రంలో జీఓ నంబర్ 117ను రద్దు చేయడం ద్వారా ఉన్నత పాఠశాలలో పనిచేసే గణితం, తెలుగు, ఇంగ్లీష్, సాంఘిక శాస్త్రాలకు చెందిన ఉపాధ్యాయులు మిగులు ఉపాధ్యాయులుగా తేలుతున్నారని అలాంటి వారిని అదే పాఠశాలలో కొనసాగించాలని నోబెల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె. శ్రీనివాస రాజు కోరారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 35 మంది విద్యార్థులకు అదనపు సెక్షన్‌గా గత ప్రభుత్వం తీసుకొందని అలాంటిది ఇప్పుడు ఈ ప్రభుత్వం 40 మంది విద్యార్థులు ఉంటేనే మరో సెక్షన్ చేస్తామనడం అన్యాయమన్నారు. ఈ సమావేశంలో నోబెల్ టీచర్స్ అసోసియేషన్ ముఖ్య నాయకులు వేణుగోపాల్ రావు, మధుసూదన్ రెడ్డి, నరసింహా రెడ్డి, పక్కీర, బచ్చల శ్రీనివాసులు, మురళీ మోహన్ రాజు, కులశేఖర్ రెడ్డి, గోవిందు నాగరాజు, ఆసీఫ్, రాజగోపాల్, వెంకట్రామరాజు తదితరులు పాల్గొన్నారు.

రామిరెడ్డిగారిపల్లెలో స్థల వివాదం

మదనపల్లె : మండలంలోని కోళ్లబైలు పంచాయతీ రామిరెడ్డిగారిపల్లెలో మంగళవారం స్థల వివాదం ఏర్పడి భూమి సర్వేను మరో వర్గం అడ్డుకోవడంతో ఉద్రిక్తత ఏర్పడింది. బాధితులు తెలిపిన మేరకు వివరాలు .. పట్టణంలోని నెహ్రూబజార్‌లో నివాసమున్న క్రిష్ణమూర్తి గుప్తాకు తన పూర్వీకుల నంచి సంక్రమించిన భూమి రామిరెడ్డిగారిపల్లె వద్ద సర్వే నంబర్ 360లో 15.5 సెంట్లు, 363లో 25 సెంట్లు, 364లో 97 సెంట్లు ఉంది. ఈ భూమిలో వివాదం ఏర్పడటంతో దాదాపు 30 సంవత్సరాలుగా కోర్టులో కేసు నడిచింది. ఏడాది క్రితం క్రిష్ణమూర్తి గుప్తా వర్గీయులకు అనుకూలంగా డిక్రీ చేస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాల ప్రతిని తాలూకా పోలీసు స్టేషన్‌లో అందించి, భూమి సర్వే చేసి తమకు అప్పగించేందుకు భద్రత కల్పించేలా కోర్టు ద్వారా పోలీసు, రెవెన్యూ అధికారులకు ఆదేశాలు అందాయి. దీంతో మంగళవారం క్రిష్ణమూర్తి గుప్తా తన కుటుంబ సభ్యులతో కలిసి రామిరెడ్డిగారిపల్లె వద్ద ఉన్న భూమి వద్దకు వెళ్లారు. సర్వే చేయడానికి రెవెన్యూ అధికారులు, పోలీసులు అక్కడికి చేరుకున్నారు. భూమి సర్వే చేస్తూ హద్దులు నిర్ణయించగా క్రిష్ణమూర్తి గుప్తా సరిహద్దు కంచెను ఏర్పాటు చేస్తుండగా అదే ప్రాంతానికి చెందిన రమణారెడ్డి వర్గీయులు సర్వేను అడ్డుకున్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు నచ్చజెప్పినా వినకుండా భూమిలో సర్వే చేయకూడదంటూ అడ్డుపడ్డారు. దీంతో అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. గొడవలు జరగకుండా ముందు జాగ్రత్తగా పోలీసులు ఇరువర్గాలను తాలూకా పోలీసు స్టేషన్‌కు పిలిపించారు.

పింఛన్ల సొమ్ము స్వాహాపై ఎంపీడీఓ విచారణ

వెల్ఫేర్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేసిన కలెక్టర్

పెద్దతిప్పసముద్రం : మండలంలోని మల్లెల గ్రామ సచివాలయ పరిధిలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఏ.గిరి అనే ఉద్యోగి నెలవారి పింఛన్ల సొమ్ము పంపిణీలో గుట్టుగా చేతివాటం ప్రదర్శించాడు. ఈ విషయంపై మూడు రోజుల క్రితం పలువురు గ్రామస్తులు బాధిత పింఛన్‌దారులతో కలసి ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్‌కు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పింఛన్ల సొమ్ము చేతివాటంపై ఎంపీడీఓ మంగళవారం ఇన్‌చార్జి ఈఓఆర్డీతో కలసి మల్లెల గ్రామానికి వెళ్లి సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌కు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం బాధిత పింఛనుదారులను విచారించగా వెల్ఫేర్ అసిస్టెంట్‌పై వచ్చిన ఆరోపణలు వాస్తవమని వెల్లడైంది. పింఛన్ల సొమ్ము స్వాహా బహిర్గతమైన విషయాన్ని అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, జిల్లా సంక్షేమ శాఖ అధికారికి ఎంపీడీఓ నివేదిక పంపారు. దీంతో తక్షణం వెల్ఫేర్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేస్తూ మండల పరిషత్ కార్యాలయానికి కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో సిబ్బంది అవకతవకలకు పాల్పడితే సహించేది లేదని కలెక్టర్ హెచ్చరించినట్లు ఎంపీడీఓ తెలిపారు.



వెల్ఫేర్ అసిస్టెంట్ సమక్షంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్

వీఎల్ఎస్ఐతో విస్తృత అవకాశాలు



మాట్లాడుతున్న షేక్ మొహమ్మద్

కురబలకోట : ఎలక్ట్రానిక్స్ రంగంలో వెరీ లార్జ్ స్కేల్ ఇంటిగ్రేషన్ (వీఎల్ఎస్ఐ) పరిశ్రమలో కొత్త అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని బెంగళూరు వీఎల్ఎస్ఐ లిమిటెడ్ ఫౌండర్ సీఈఓ షేక్ మొహమ్మద్ అన్నారు. అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఎక్లిటికా-25 పేరిట జాతీయ సింపోసియం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా వీఎల్ఎస్ఐ టెక్నాలజీ విప్లవాత్మకమైన అభివృద్ధిగా పరిగణించబడుతోందన్నారు. వేలాది సంఖ్యలో ట్రాన్సిస్టర్లు, రెజిస్టర్లు, కెపాసిటర్లు వంటి ఎలక్ట్రానిక్ కంపోనెంట్లను ఒకే మైక్రోచిప్ మీద ఇంటిగ్రేట్ చేయడాన్ని సూచిస్తుందన్నారు. దేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా విస్తృత ఉపాధి, ఉద్యోగ అవకాశాలు వేగంగా పెరుగుతున్నాయన్నారు. 200 మంది ఈ సందర్భంగా పేపర్ ప్రజంటేషన్ చేశారు.

చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న గిరిజనులు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలం రెడ్డివారిపల్లి త్రిమూర్తి నగర్ గిరిజనుల ఇంటి స్థలాల భూమిని ఆక్రమించుకొని చెట్లు నరికి వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పందికాళ్ల మణి కోరారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బాధితులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ 1997 సంవత్సరం ఫిబ్రవరి నెలలో 573 సర్వే నంబర్‌లో దర్శి శేషయ్య కొంత భూమిని ఏటి పక్కన ఉండే 15 గిరిజన కుటుంబాలకు అగ్రిమెంటుపై విక్రయించారన్నారు. సుమారు 3 దశాబ్దాలుగా అక్కడ గుడిసెలు వేసుకొని మామిడి చెట్లు నాటుకొని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఉన్నట్లుండి దర్శి శ్రీనివాసులు మరికొందరు జేసీబీలు, ట్రాక్టర్లతో వచ్చి కూల్చి వేశారని తెలిపారు. అడ్డుకోబోయిన తమను కులంపేరుతో దూషించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నవీన్‌కుమార్, ఈశ్వరయ్య, గోవర్దన్ తదితరులు పాల్గొన్నారు.

చెట్లను నరికితే ఊరుకోం



చెట్లను నరకవద్దని సూచిస్తున్న గ్రామస్తులు

నందలూరు : విద్యుత్ లైన్ ఏర్పాటు కోసం నీడనిస్తున్న చెట్లను నరికితే ఊరుకోమని పాటూరు గ్రామ పంచాయతీ పరిధిలోని శివరాంపురం, ఎర్రిపాపయ్యగారిపల్లి గ్రామస్తులు హెచ్చరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ పాటూరుకు వెళ్లే దారిలో శివరాంపురం వద్ద విద్యుత్ లైన్ ఏర్పాటు కోసం ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నాయని, కానీ ఎందుకో కాంట్రాక్టర్ చెట్ల మధ్యలో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పర్యావరణ పరిరక్షణకోసం మొక్కలను నాటి ప్రజలకు మేలు చేయాలని సూచిస్తుంటే దాదాపు 50 సంవత్సరాల వయస్సు కల్గిన చెట్లను విద్యుత్ లైన్ ఏర్పాటు కోసం నరకడం ఏమిటని ప్రశ్నించారు.

బీజేపీ ఫాసిస్టు విధానాలను తిప్పికొడతాం



సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీజెండాను ఎగురవేస్తున్న ఆ పార్టీ నేతలు.

రాయచోటి అర్బన్ : దేశంలో బీజేపీ అనుసరిస్తున్న ఫాసిస్టు విధానాలను అందరం కలసి తిప్పికొడదామని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఎం. విశ్వనాథ పిలుపునిచ్చారు మంగళవారం పట్టణంలోని బస్టాండు సర్కిల్‌లో సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన పార్టీ కార్యకర్తలతో కలసి పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం దేశంలోని సంపదను అదాని, అంబానీలకు అప్పజెప్పడం కోసం ఆపరేషన్ కగార్ పేరుతో దండకారణ్యంలో ఆదివాసీలపై నరమేధాన్ని సృష్టిస్తోందన్నారు. వక్ఫ్ సవరణ బిల్లును ప్రవేశపెట్టడం ద్వారా ఐక్యంగా ఉన్న భారత ప్రజలలో అనైక్యతను సృష్టించేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. కార్యక్రమంలో లిబరేషన్ పార్టీనేతలు రమణ, రఘునాథనాయుడు, సుజాత, పెద్దన్న రామాంజి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.